# దండోపాయం

ఈతకోట తులసీ రామారావు



**"మామయ్యా!"**

**వ్యాన్ దిగి మానేజర్ రూమ్ వైపు నడుస్తున్న రాజేష్ ఆ పిలుపు విని ఆగి వెనక్కి తిరిగి చూశాడు.**

లేడీస్ బుకింగ్ కౌంటర్‌కి కొంచెం దూరంగా నిలుచుని ఉంది అపర్ణ.

గబ గబా ఆమె దగ్గరికి నడిచాడు రాజేష్.

కొత్త సినిమా కావటం వలన హాలు ముందు చాలా రద్దీగా వుంది.

"ఏమిటి అపర్ణా? సినిమాకు వచ్చావా? టిక్కెట్లు కావాలా? ఎంత మంది మీరు?" అంటూ అడిగాడు అపర్ణను చేరుకొని.

"లేదు మామయ్యా! సినిమాకు రాలేదు నేను. నీ కోసమే వచ్చాను. ఈవేళప్పుడు కచ్చితంగా ఇక్కడుంటావని ఊహించాను" అన్నది చిన్నగా నవ్వి.

రాజేష్ కూడా నవ్వి, " ఈ రోజే సినిమా రిలీజ్ కాబట్టి మీ మామయ్య బ్లాక్‌టికెట్స్ అమ్మించడానికి తప్పకుండా వస్తాడని ఊహించి ఇక్కడే కాపు కాశావన్నమాట. సరేగానీ ఇంతకీ ఏమిటి పని?" అని ప్రశ్నించాడు.

"అమ్మ నిన్నొకసారి ఇంటికి రమ్మని చెప్పమన్నది. వీలైతే ఇప్పుడే రమ్మన్నది" అని బదులిచ్చింది అపర్ణ.

రాజేష్ ఆశ్చర్యపోయాడు. అక్కయ్య తనని ఇంటికి రమ్మని పిలిచిందా? నమ్మలేకపోయాడు.

"నిజంగానా?" రెట్టించి అడిగాడు అపర్ణని.

"నిజం మామయ్యా!" చెప్పింది అపర్ణ.

"సరే! నువ్విక్కడే ఉండు. రెండు నిముషాల్లో వస్తాను. ఇద్దరం కలిసే వెళదాం." అని చెప్పి గబగబా మానేజర్ రూమ్ లోకి నడిచాడు రాజేష్.

సెంకడ్ షోకి తన మనుష్యులకి ఎన్ని టిక్కెట్లు ముందుగా ఇవ్వవలసిందీ చెప్పి బయటికి వచ్చాడు. బయట బ్లాక్‌లో టిక్కెట్లు అమ్ముతున్న తన వాళ్లందరినీ పలకరించి అపర్ణ దగ్గరికి వచ్చాడు.

"పద వెళదాం!" అంటూ హాలు దాటి బయటికి వచ్చాడు. అపర్ణ అతడిని అనుసరించింది.

డేవిడ్ వ్యాన్ తీసుకొచ్చి ఆపాడు.

"డేవిడ్! వ్యాన్ నేను తీసుకెళతాను. నువ్వు మనవాళ్లతో కలిసి వెళ్లిపో!" అని చెప్పి డేవిడ్ దిగగానే తను డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు రాజేష్. అపర్ణ కూడా వ్యాన్ ఎక్కి అతని పక్క సీట్లో కూర్చోగానే డేవిడ్ డోర్ మూసి నమస్కారం చేశాడు.

వ్యాన్ నేతాజీ కాలనీ వైపు దూసుకు పోతూవుంది. రాజేష్ మనసులో ఆలోచనలు అంతకంటె వేగంగా పరుగులు తీస్తున్నాయి.

రెండేళ్ల క్రితం తన ఇంటి గడప తొక్కవద్దని శాసించిన అక్క ఈనాడు తన కోసం కబురంపించిందంటే ఏదో చాలా ముఖ్యమైన పని అయి వుండాలి. అది ఏమైవుంటుందా అని రాజేష్ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

అపర్ణ అతని భుజం పైన చెయ్యివేసి కుదుపుతూ, "ఏమిటి మామయ్యా, అంత సీరియస్‌నెస్? ఏదైనా మాట్లాడు" అన్నది.

"పరీక్షలు దగ్గరకొస్తున్నాయనుకుంటాను. బాగా చదువుతున్నావా అపర్ణా! నిన్ను డాక్టర్ చెయ్యాలని మీ అమ్మానాన్నల ఆశ! ఎంసెట్‌కి కోచింగ్ ఎక్కడ తీసుకుంటావు?" అని అడిగాడు రాజేష్.

"నన్ను డాక్టర్‌గా చూడాలని నీకు మాత్రం ఆశగా లేదా మామయ్యా?" నవ్వుతూ అడిగింది అపర్ణ.

ఆమె తలమీద మొట్టికాయవేసి, 'అల్లరిపిల్లా!' అన్నాడు రాజేష్. మరో ఐదు నిముషాల్లో అపర్ణ వాళ్ల ఇంటి ముందు ఆగింది వ్యాన్.

రాజేష్ వ్యాన్ దిగి అపర్ణ వైపు అనుమానంగా చూస్తూ, "మీ నాన్న కూడా ఇంట్లో వున్నాడా?" అని ప్రశ్నించాడు.

"నాన్న ఉదయాన్నే నెల్లూరు వెళ్లారు. రేపు మధ్యాహ్నానికి వస్తారు. భయపడకుండా ఇంట్లోకి రా మామయ్యా!" అంటూ రాజేష్ చెయ్యిపట్టుకొని ముందుకి నడిచింది అపర్ణ.

వ్యాన్ శబ్దం విని వాకిట్లోకి వచ్చింది సరస్వతి.


కూతురు వెంట లోనికి వస్తున్న రాజేష్‌ను చూడగానే ఆమె కళ్లు ఆనందంతో మెరిశాయి.

"రా రాజా! బావున్నావా?" అంటూ ఆప్యాయంగా పలకరించింది.

"బావున్నానక్కా! మీరు కులాసా కదూ!" అని పలకరిస్తూ ఆమె వెంటలోనికి నడిచాడు రాజేష్.

సోఫాలో కూర్చున్నాడు రాజేష్. అపర్ణ అతని పక్కనే కూర్చుని తన కాలేజీ కబుర్లు చెబుతూ గలగలా మాట్లాడుతూ వుంది. సరస్వతి తమ్ముడికి కాఫీ కలుపుకు రావటానికి వంటింట్లోకి వెళ్లింది.

మేనగోడలి మాటలు వింటూ ఒక విధమైన తన్మయత్వంలో తేలిపోతున్నాడు రాజేష్. ఆప్యాయత, అనురాగం కురిసే ఇలాంటి మనుష్యులకు దూరంగా బతక వలసి రావటం అతని మనసుని బాధించసాగింది. ఇందులో ఎవరి దోషమూ లేదు. కేవలం తన స్వయంకృతాపరాధం. తను ఎంచుకున్న జీవన పంథా సమాజం హర్షించేది కాదు. రౌడీయిజం, గూండాయిజం, అక్రమ వ్యాపారాలు తనని ఆకర్షించి ఆ బాటలోకి వెళ్లిపోయాడు. అక్క, బావ ఎంత చెప్పి చూసినా ఆ జీవితం పట్ల ఆకర్షణను, ఆశను చంపుకో లేకపోయాడు. బావ నీతికి కట్టుబడి జీవించే వ్యక్తి. తన వల్ల ఎన్నో అవమానాలు, అవహేళనలు ఎదుర్కొన్నాడు. చివరికి విసుగు పుట్టి తనని




ఇంట్లో నుంచి వెళ్లిపొమ్మన్నారు. బావ మాట కాదనలేక అక్క కూడ తనని వెళ్లిపొమ్మంది. వాళ్లకు ఇబ్బంది కలిగించలేక తను ఆ ఇంట్లో నుండి వచ్చేసి విడిగా బ్రతుకుతున్నాడు.

"కాఫీ తీసుకో రాజా!"

సరస్వతి పిలుపుతో ఆలోచనల నుండి తేరుకొని ఆమె చేతిలోని కాఫీ కప్పు అందుకున్నాడు రాజేష్.

సరస్వతి అతని ఎదురుగా కుర్చీలో కూర్చుంటూ అపర్ణ వైపుకి తిరిగి, "మీ ఫ్రెండ్ సరళ వాళ్లింటికి వెళ్లి ఏదో నోట్సు తెచ్చుకోవాలన్నావు గదా! వెళ్లిరా!" అన్నది.

అపర్ణ అక్కడి నుండి వెళ్లిపోయింది.

తనతో ఏకాంతంగా మాట్లాడాలని అక్క అపర్ణను బయటికి పంపించిందని అర్థం చేసుకున్నాడు రాజేష్.

"ఏమిటి విషయం అక్కా?" కాఫీ కప్పు టీపాయ్ మీద పెడుతూ అడిగాడు రాజేష్.

సరస్వతి తమ్ముడి ముఖంలోకి చూస్తూ "అపర్ణ విషయం నీతో కొంచెం మాట్లాడదామని పిలిపించానురా!" అన్నది.

'కొంపదీసి ఏ ప్రేమ వ్యవహారమో కాదు గదా! ఈ రోజుల్లో ఇంటర్మీడియట్ లెవెల్ నుండే ప్రేమ కథలు ప్రారంభం కావటం సహజమే!' మనసులోనే అనుకుంటూ చెప్పమన్నట్లు చూశాడు.

"అపర్ణ కాలేజీకి వెళ్లనని మొండికేస్తున్నది" సరస్వతి మెల్లిగా చెప్పింది.

ఆశ్చర్యపోయాడు రాజేష్. చదువులో ఎప్పుడూ అందరి కంటే ముందుండే అపర్ణ కాలేజీకి వెళ్లనని చెప్పడమా?

"కారణం?" విస్మయంగా అడిగాడు రాజేష్.

సరస్వతి కొద్ది క్షణాలు మౌనంగా వుండి ఆ తర్వాత అన్నది.

"కాలేజీలో కొంత మంది కుర్రాళ్లు దానిని ఏడిపిస్తున్నారట! కామెంట్స్ చేయడం, వెంటబడి ఇంటి దాకా రావటం ఇలాంటివన్నీ చేస్తున్నారట. అది భయపడిపోతున్నది. ఇంటికొచ్చి ఒకటే ఏడుపు. ఆ భయంతో చదువు మీద కూడ ఏకాగ్రత కుదరటం లేదు. ఆ విషయం గురించి ఎంతగా భయపడి ఆలోచిస్తున్నదంటే ఒక్కోసారి రాత్రిళ్లు నిద్రలో కూడా కలవరింతలు,ఏడుపు!"

రాజేష్ ముఖం ఆవేశంతో జేవురించింది.

"ఎవరా రాస్కెల్స్! చెప్పు! ప్రాణాలు తీస్తాను!' అన్నాడు.

"ఆవేశం వద్దు రాజా! ఎలాంటి గొడవలూ జరగకుండా వాళ్లు దాని జోలికి రాకుండా చూడాలి' అన్నది సరస్వతి.

"బావ ఎందుకు ఊరుకున్నాడు ఇంతకాలం? కాలేజీ ప్రిన్సిపాల్‌కే, లేదంటే పోలీసులకీ రిపోర్టు చెయ్యలేకపోయాడా?" అని ప్రశ్నించాడు.

సరస్వతి నిట్టూర్చి, " అన్నీ అయ్యాయి. ఆ కుర్రవాళ్లు బాగా డబ్బు, పలుకుబడి ఉన్న కుటుంబాల నుండి వచ్చిన వారట. రాజకీయంగా కూడా అంతో ఇంతో పలుకుబడివున్నట్లుంది. ప్రిన్సిపాల్ నిస్సహాయత వ్యక్తం చేస్తే పోలీసులు 'కాలేజీల్లో ఇంలాంటివన్నీ సహజం సార్! సర్దుకుపోండి' అని సలహా ఇచ్చి పంపేశారు మీ బావని" అన్నది.

రాజేష్ ఆలోచిస్తూ ఉండిపోయాడు.

"మీ బావ కూడ ఈ విషయమై చాలా మథన పడుతున్నారు. నాకు ఎటూపాలుపోక నీతో చెప్పడం మంచిదనిపించింది" అన్నది సరస్వతి.

ఇంతలో అపర్ణ అక్కడికి వచ్చింది.

ఆమెను పిలిచి సోఫాలో తన పక్కనే కూర్చోబెట్టుకుని, "నిన్ను అల్లరి పెడుతున్న వాళ్ల పేర్లు ఏమిటి?" అని అడిగాడు.

అపర్ణ ఒకసారి తల్లివైపు చూసింది. చెప్పమని ఆమె సంజ్ఞచేయటంతో ఆ నలుగురి పేర్లూ రాజేష్‌తో చెప్పింది.

రాజేష్ అపర్ణ భుజం తట్టి ధైర్య చెపుతూ, "నువ్వేం భయపడకు అపర్ణా! నీ చదువు విషయం నువ్వు చూసుకో! వాళ్లు నీ జోలికి రాకుండా చూసే బాధ్యత నాది" అని లేచి నిల్చున్నాడు.

"జాగ్రత్త రాజా! ఎలాంటి గొడవలు సృష్టించకు' అని చెప్పింది సరస్వతి రాజేష్‌తో.

రాజేష్ తలవూపి బయటికి నడిచాడు.

❋ ❋ ❋

రెండు రోజుల తర్వాత కాలేజీలో అపర్ణకు ఒక విషయం తెలిసింది. తనని అల్లరిపెడుతున్న నలుగురు కుర్రవాళ్లని ఎవరో రోడ్డు మీద కాపు కాచి చితకబాదారట. ఒళ్లంతా గాయాలతో ఆసుపత్రిలో చేరారట! వారం తర్వాత వాళ్లు కాలేజీకి వచ్చారు. అయితే అపర్ణను చూడగానే తలదించుకుని పక్కకు పోతున్నారు. ఇది వరకటిలాగ వేధింపులు, అల్లరి చేష్టలు పూర్తిగా మానేశారు.

అపర్ణ హాయిగా ఊపిరి పీల్చుకుంది.

ఒకరోజు సాయంత్రం రాజేష్ అక్క ఇంటికి వచ్చాడు. అపర్ణ, సరస్వతి అతనిని ఆప్యాయంగా ఆదరించారు. రాజేష్ బావ చక్రవర్తి మాత్రం "హల్లో!" అని పలకరించి పేపర్లో తలదూర్చాడు. భార్య ద్వారా విషయం అంతా అప్పటికే విని ఉన్నాడు అతడు. తన వల్ల, ప్రిన్సిపాల్ వల్ల, పోలీసుల వల్ల సాధ్యంకాని పనిని రాజేష్ ఇంత సునాయాసంగా సాధించటం అతనికి గిల్టీగా వుంది.

రాజేష్ అపర్ణను దగ్గర కూర్చోబెట్టుకొని, "జీవితంలో ఇంకెప్పుడూ వాళ్లు నీ జోలికి రారు. వాళ్లే కాదు. ఏ కుర్రాడూ నీ జోలికి రాడు. ఇంక ఆ విషయాలన్నీ మర్చిపోయి శ్రద్ధగా చదివి ఇంటర్‌లో ఫస్ట్ క్లాస్, ఆ తర్వాత ఎం.సెట్‌లో ర్యాంక్ తెచ్చుకో! నిన్ను డాక్టర్ అపర్ణగా చూడాలి! ఓ.కే?" అన్నాడు.

రాజేష్ బయటికి నడుస్తూ ఒక క్షణం బావ దగ్గర ఆగాడు.

"చూడు బావా! ఈ సమస్యను నేను ఏ విధంగా పరిష్కరించానో నీకు తెలుసు. నువ్వు దీన్ని హర్షించలేకపోవచ్చనీ నాకు తెలుసు. కొన్ని జబ్బులు మాత్రలతో నయమైతే, కొన్ని జబ్బులకు ఇంజక్షన్స్ అవసరం. మరీ మొండి జబ్బులు కొన్నింటికి ఆపరేషన్ అవసరం! సామ, దాన, భేదాల ద్వారా జరగని కొన్న పనులకి చివరి అస్త్రం - ఐమీన్ - దండోపాయం తప్పని సరి. ప్రస్తుత సమాజం నుండి నేను నేర్చుకున్న సత్యం ఇది." అని గబగబా బయటికి నడిచాడు.

చక్రవర్తి రాజేష్ వెళ్లిన వైపే చూస్తూ ఉండిపోయాడు. అప్రయత్నంగా అతని పెదాలు, "థ్యాంక్స్ రాజా!" అని ఉచ్చరించాయి. ○